క్లుప్తంగా

కొనసాగుతున్న జూనియర్ డాక్టర్ల సమ్మె

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ డాక్టర్ల భవిష్యత్తు, హక్కులను కాలరేసేందుకు విడుదల చేసిన జీవోలను నిరసిస్తూ జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మె రెండవరోజుకు చేరింది. జూనియర్ డాక్టర్ల యూనియన్ పిలుపు మేరకు అత్యవసర వైద్యసేవలు యథావిధిగా చేస్తున్నారు. సాధారణ సేవలు మాత్రం సమ్మెలో ఉన్నందున నిలుపుదల చేశారు. పోతునూరు, గోపన్నపాలెం, దెందులూరు వైద్యశాలల్లో జూనియర్ డాక్టర్లు సమ్మెలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో జూనియర్ డాక్టర్ల భవిష్యత్‌ను అడ్డుకునేలా ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. జూనియర్ డాక్టర్ల డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి పీహెచ్‌సీల్లో వైద్యసేవలు యథావిధిగా అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యశాలకు వచ్చిన వారు డిమాండ్ చేస్తున్నారు.

నేడు వ్యాయామ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

దెందులూరు: గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో మంగళవారం వ్యాయామ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించనున్నట్టు దెందులూరు నియోజకవర్గ సెక్రటరీ ఎల్‌వీడీ రవిబాబు తెలిపారు. కాంప్లెక్స్ పరిధిలో వ్యాయామ ఉపాధ్యాయులు విధిగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరుకావాలని ఆయన సూచించారు.

పరిహారంగా రూ.50 లక్షలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు సమీపంలోని శ్రీ విజయ దుర్గ ట్రేడర్స్ కంపెనీలోని హైడ్రాలిక్ మిషన్ (బేల్ ప్రెస్) మెషీన్‌లో పడి దారుణంగా మృతి చెందిన బీహార్ వలస కార్మికుడు పుల్సార్ శర్మ కుటుంబానికి రూ.50 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని సీఐటీయూ ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మృతుడు 15 సంవత్సరాల నుంచి ఆ కంపెనీలో పనిచేస్తున్నాడని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, జిల్లాప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్‌లు తెలిపారు. సోమవారం వారు పూల్సార్ శర్మ మృతి చెందిన హైడ్రాలిక్ మెషీన్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుడు చనిపోయిన తీరు చూస్తుంటే.. అది ప్రమాదవశాత్తూ కాదని, ఉద్దేశపూర్వకంగానే చంపారనే ఆలోచన కలుగుతుందని తెలిపారు. కంపెనీ యాజమాన్యం వలస కార్మికుల చట్టం లేదా కార్మిక చట్టాలేమీ అమలు చేయడం లేదని ఆరోపించారు. కంపెనీలో దాదాపు 100 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నప్పటికీ.. వారెవరికీ పీఎఫ్, ఈఎస్ఐ, పని గంటలు, వారాంతపు, పండుగ సెలవులు తదితర సౌకర్యాలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుడు మృతిపై భిన్న కోణాల్లో దర్యాప్తు చేయించాలని వారు డిమాండ్ చేశారు.

నిమజ్జనోత్సవానికి పోలీస్ బందోబస్తు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, గణేశ్ విగ్రహాల నిమజ్జనం, మరోవైపు మిలాద్ ఉన్ నబీ పర్వదినాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ ప్రాంతంలోనూ, గణేష్ విగ్రహాల నిమజ్జనం ప్రాంతాల్లోను భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. సీఐలు జి.సత్యనారాయణ, వైవీ రమణ, కోటేశ్వరరావు, గోపాలకృష్ణ, సీహెచ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నగరంలో పోలీస్ సిబ్బంది ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారని డీఎస్పీ తెలిపారు.

ఏలూరులో పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్

ఏలూరు టౌన్: ఏలూరు అమీనాపేట పోలీస్ కల్యాణ మండపం సమీపంలో పోలీస్ క్వార్టర్స్ ఎదురుగా ప్రధాన రహదారి పక్కన భారత్ పెట్రోల్ కంపెనీకి చెందిన పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంకు ఏర్పాటుకు ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ శంకుస్థాపన చేశారు. పెట్రోల్ స్టేషన్ భవన నిర్మాణ డిజైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పెట్రోల్ బంక్ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన, పక్కా కొలతలతో పెట్రోల్, డీజిల్ అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ హెచ్‌వోడీ కె.శ్రీధర్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ స్టూడెంట్స్ ఏలూరులోని ఫైర్‌స్టేషన్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ నినదించారు. పర్యావరణం పరిరక్షణపై విద్యార్థులు వీధి నాటిక ప్రదర్శించారు. మొక్కలు నాటుదాం, వృక్షాలుగా పెంచుదాం, ప్లాస్టిక్ కవర్లను విడనాడుదాం, క్లాత్, జూట్ బ్యాగులను వాడదాం అంటూ నినదించారు. ఈ సందర్భంగా హెచ్‌వోడీ శ్రీధర్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగితే మానవజాతి తీవ్రంగా నష్టపోతుందని హెచ్చరించారు. అనంతరం క్లాత్ బ్యాగులను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల స్టాఫ్ కోఆర్డినేటర్ ఎన్ సతీష్, ఇ.కవిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ నిలుపుదల

- వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో అందని వైద్య సేవలు
- ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి నిరాశతో వెనుదిరుగుతున్న బాధితులు


దెందులూరు సీహెచ్‌సీలో కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: కూటమి ప్రభుత్వం వైఎస్సార్ కంటివెలుగు పథకాన్ని నిలుపుదల చేసింది. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ ఒక్కరూ కంటికి సంబంధించి అనారోగ్యంతో బాధపడకూడదన్న లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేశారు. గ్రామ శివారు, గిరిజన ప్రాంతాల్లోని వారికి సైతం కంటివైద్యం అందాలని డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు పథకాన్ని ఏర్పాటు చేశారు. ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులోకి తీసుకువచ్చి అర్హులైన కంటి వైద్య నిపుణులను వైద్యశాలల్లో ఏర్పాటు చేశారు. వైద్యశాలల్లో సండాక్స్ ద్వారా డయాబెటిక్ రెటినోపతి వ్యాధి లక్షణాలు, నిర్ధారణ, ఆటోరెఫరేటివ్ మీటర్‌తో దృష్టిలోపం, దగ్గర, దూరం లోపం, పర్సంటేజ్‌ను నిర్ధారిస్తుంది. ఈ అత్యాధునిక పరికరాలతో గ్రామశివారు ప్రాంతాలతో పాటు గిరిజన ప్రాంతాల్లోనూ కంటి సమస్యలతో ఉన్న బాధితులకు ఖరీదైన వైద్యాన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో అందించారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ముందు పదుల సంఖ్యలో కంటివైద్య పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పదిరెట్లుపైన పరీక్షల సంఖ్య పెరిగింది. దెందులూరు నియోజకవర్గంలో 23,736 మందికి పరీక్షలు చేశారు. 11,618 మందికి రెటీనా పరీక్షలు చేశారు. 17,600 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ నెల 5వ తేదీ నుంచి వైఎస్సార్ కంటివెలుగు పథకాన్ని నిలుపుదల చేశారు. ఎంతో ఆశతో ప్రభుత్వ వైద్యశాలలకు వస్తున్న బాధితులకు ఈ పథకం నిలుపుదల చేశారని తెలియడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. బాధితులు వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు.

డీఎంఅండ్‌హెచ్‌ఓ వివరణ

కంటి వైద్యపరీక్షలు నిలుపుదల చేసిన సంగతి వాస్తవమేనని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్. శర్మిష్ట అన్నారు. ఈ పథకం రెన్యూవల్ అయిన వెంటనే యథావిధిగా వైద్యపరీక్షలు, వైద్యసేవలు, ప్రభుత్వ వైద్యశాలలో కొనసాగుతాయన్నారు.

వైద్య పరీక్షలు కొనసాగించాలి



పేద, బడుగు, బలహీన వర్గాలు ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యం పొందుతున్నారు. అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ మంచి జరగాలని ఈ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేశారు. ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగించాలి.

– పోకల రాంబాబు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా నాయకులు

పేదలపై ఆర్థిక భారం



ప్రభుత్వ వైద్యశాలలో కంటి వైద్య పరీక్షలు నిలిపివేయడంతో పేదలందరిపై ఆర్థిక భారం పడింది. ప్రభుత్వం పేదలకు మంచి చేయాలే తప్ప, మంచిని అడ్డుకోవడం సరైనది కాదు. ఇలాగే పథకాలను నిలుపుదల చేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత తప్పదు.

– గొరిపర్తి వరలక్ష్మి, ఎంపీటీసీ, కొవ్వలి

పథకాన్ని పునరుద్ధరించాలి



ప్రభుత్వం కంటివైద్య పథకాన్ని పునరుద్ధరించాలి. లోపం ఎక్కడ ఉందో తెలుసుకోవాలి. ఈ పథకం నిలుపుదల వల్ల వేలాది మందికి ప్రభుత్వ సేవలు ఆగిపోయాయి. ఇది కరెక్టు కాదు. పేదలంతా ప్రైవేటు వైద్యం ఎలా చేయించుకుంటారు.

– తనగాల శేఖర్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ప్రభుత్వం పునః పరిశీలించాలి



ప్రభుత్వ వైద్యశాలల్లో షరతులు లేకుండా కంటి వైద్య పరీక్షలు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం పథకం ముందు వైఎస్సార్ పేరుఉందని, పేదలందరికీ జరిగే మంచిని అడ్డుకుంటే భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రకటిస్తాం. ప్రభుత్వం వెంటనే పునఃపరిశీలించాలి.

– పష్లెం ప్రసాద్, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్

వరద బాధితులకు ఆర్థిక సాయం

ఉంగుటూరు: వరద బాధితులకు పలువురు దాతలు ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు సోమవారం పలువురు దాతలు వీటికి సంబంధించిన చెక్కులను అందజేశారు. గణపవరం, నిడమర్రు మండలా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుబ్బరాజు రూ.50 వేలు అందజేశారు. చేబ్రోలు అమృత హోటల్ యజమాని శీలం పల్లేశ్వరరావు రూ.30 వేలు అందజేశారు. ఉప్పాకపాడుకు చెందిన ముత్యాల పల్లేశ్వరరావు రూ.10 వేలు అందజేశారు. ఉప్పాకపాడు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సేకరించిన విరాళాలు రూ.15 వేలను ఎస్ఎంసీ చైర్మన్ కన్నాటి వెంకటేష్‌తో కలిసి ఎమ్మెల్యేకి అందజేశారు. గణపర్రు సర్పంచి కూనాపరాజు సత్యనారాయణరాజు రూ.25వేలు అందజేశారు. వారందరికీ ఎమ్మెల్యే ధర్మరాజు కృతజ్ఞతలు తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

గణపవరం: ఇటీవలి భారీ వర్షాలు, వరదల కారణంగా గ్రామాల్లో క్షీణించిన పారిశుధ్య పరిస్థితులను చక్కదిద్దేందుకు గ్రామ పంచాయతీలు చర్యలు ప్రారంభించాయి. ఇటీవలి వర్షాలకు గ్రామాల్లో చెత్తా చెదారం పేరుకుపోయింది. మురుగు డ్రెయిన్లలో నీరు పొంగి రోడ్లపైకి చేరింది. ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన పిచ్చిమొక్కలు, గడ్డి విపరీతంగా పెరిగింది. దీనితో దోమల వ్యాప్తి బాగా పెరిగింది. గ్రామాల్లో ప్రజలు అంటు వ్యాధులు, వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు పంచాయతీలు చర్యలు ప్రారంభించాయి. దోమల నిర్మూలనకు రసాయనాలు, కలుపు మందు పిచికారీ చేస్తున్నారు. డ్రెయిన్లను శుభ్రం చేసి, చెత్త కుప్పలు తొలగిస్తున్నారు.

అండర్‌పాస్‌లో వర్షం నీరు తొలగింపు


అండర్‌పాస్‌లో నీరు తొలగించిన దృశ్యం


అండర్‌పాస్‌లో ఏర్పాటు చేసిన ట్యూబ్‌లైట్లు

సాక్షి స్పందన

దెందులూరు: ఎట్టకేలకు రైల్వే అధికారులు స్పందించారు. దెందులూరు– అలుగులగూడెం మధ్య నిర్మించిన అండర్‌పాస్‌లో వర్షపు నీటిని సోమవారం తొలగించారు. పేరుకుపోయిన మట్టిని తీసివేశారు. అండర్‌పాస్‌లో వెలుగు కోసం నాలుగు ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేశారు. అండర్‌పాస్‌లో నిలిచిన వర్షం నీరు తదితర సమస్యలపై ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనంపై రైల్వే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించారు. అండర్‌పాస్‌లో బోరును శాశ్వతంగా ఏర్పాటు చేయకపోతే వర్షం కురిసినప్పుడు మళ్లీ ఇదే సమస్య పునరావృతమవుతుందని రెండు మండలాల ప్రజలు అంటున్నారు. ఏడాది నుంచి రెండు గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన రైల్వే అధికారులు వర్షపు నీటిని, మట్టిని తొలగించడంపై ప్రజలు, విద్యార్థులు, వృద్ధులు, రైతులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

ఏలూరు (టూటౌన్): అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సోమవారం మినీ వర్కర్ల జిల్లా సదస్సు సరళ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ మినీ వర్కర్లు వర్కర్, హెల్పర్ల పనులు చేస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె కాలంలో వీరికి హామీ ఇచ్చినెరవేర్చలేదని ఆరోపించారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌లుగా మార్పు చేయాలని, వేసవి సెలవులు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణ భారాన్ని అంగన్‌వాడీలపై పెట్టొద్దని, ప్రభుత్వమే గ్యాస్ సిలిండర్లు, కందిపప్పు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సెంటర్ల బలోపేతానికి చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడి ప్రసాద్‌లు మాట్లాడారు. యూనియన్ నాయకులు కె.విజయలక్ష్మి, టి.మాణిక్యం, కె.పుష్ప, ఇందిర, మరియమ్మ, సుజాత, సత్యజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా గణనాథుని ఊరేగింపు

- ఆకట్టుకున్న శక్తి వేషధారణలతో నృత్య ప్రదర్శనలు
- ఏలూరు కాలువలో విగ్రహాల నిమజ్జనాలు


కొవ్వలి రాజులపేటలో స్వామివారిని పూజిస్తున్న చిన్నారులు


భీమడోలులో ఊరేగుతున్న శ్రీమన్మహా గణనాథుడు


భీమడోలులో శక్తి వేషధారుల నృత్య ప్రదర్శన

భీమడోలు: వినాయక చవితి ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిసాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లోని చవితి వేడుకల్లో భక్తులతో పూజలందుకున్న లంబోధరునికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గోదావరి కాలువలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. భీమడోలు గణపతి సెంటర్‌లోని శ్రీమన్మహా గణనాథుని 60వ నవరాత్రి వేడుకలు ముగిశాయి. సుందరంగా అలంకరింపబడిన ట్రాక్టర్‌పై గణనాధుని ఉంచి ఊరేగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. విచిత్ర శక్తి వేషాలు, వారి నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నారు. ఆదివారం రాత్రి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూలకు వేలం నిర్వహించారు. 30 కేజీల లడ్డూను డ్రాలో గెలుపొందిన భక్తునికి అందించారు. భక్తులు సమర్పించిన లడ్డూలను వేలం వేశారు. భీమడోలులోని శ్రీఅభయ గణపతి స్వామి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా వీధుల్లో స్వామి వారిని ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. అనంతరం గోదావరి కాలువలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ కార్యదర్శి దత్తాడ శ్రీనివాసరాజు, నిర్వాహకులు గంధం భాస్కరరావు, గంధం వెంకట్రావు, తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, గోపిశెట్టి రమేష్, ఈడే సత్యనారాయణ, యర్రంశెట్టి శివ, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వినాయకునికి చిన్నారుల పూజలు

దెందులూరు: కొవ్వలిలో రాజులపేటలో కనకదుర్గమ్మవారి గుడి వద్ద శ్రీ విద్యాగణపతి యూత్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా సోమవారం చిన్నారులు స్వామివారిని పూజించారు. అనంతరం ట్రాక్టర్‌పై గణేశ్ విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జనం చేశారు. మండలంలో అన్ని గ్రామాల్లో స్వామివారి విగ్రహాలను నిమజ్జనాలు చేశారు. దెందులూరు నూపాటి వీధిలో 25 అడుగుల వినాయక విగ్రహం ఊరేగింపు వైభవంగా కొనసాగింది. నిర్వాహకులు, గ్రామస్తులు సందడిగా స్వామివారి విగ్రహాన్ని ఊరేగించి గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు.

వినాయక విగ్రహాల నిమజ్జనం

ఉంగుటూరు: వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఉంగుటూరులో స్వామి విగ్రహాల ఊరేగింపు, ఆలయాలవద్ద అన్న సంతర్పణలు నిర్వహించారు. ట్రక్కు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. నారాయణపురం సెంటర్లో 70ఏళ్లుగా నిర్వహిస్తున్న వినాయకుని ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఊరేగింపు, నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అడపా శ్రీను ఆధ్వర్యంలో వర్తక సంఘం సభ్యులు ఊరేగింపులో పాల్గొన్నారు. గోదావరి కాలువలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. మండలంలోని కైకరం, బాదంపూడి, గొల్లగూడెం, రాచూరు తదితర గ్రామాల్లోనూ ఊరేగింపులు, వినాయక విగ్రహాల నిమజ్జనాలు నిర్వహించారు.

విఘ్నేశ్వరస్వామిని గ్రామోత్సవం

పెదపాడు: స్థానిక తెలగాలపేట విఘ్నేశ్వరస్వామిని సోమవారం గ్రామంలో ఊరేగించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా వైభవంగా ఈ గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం తోటగూడెం వద్ద కృష్ణా కెనాల్‌లో గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

వరుణుడి ప్రతాపానికి రైతన్నలు విలవిల


గుండుగొలను శివారులో మునిగిన పంట చూపుతున్న రైతు


సాయన్నపాలెం ఏరియాలో మునిగిన పంట చేను

- సార్వా సీజన్‌లో రెండు సార్లు ముంపు బారిన వరి పొలాలు
- అన్నదాతల కంట కన్నీరు
- అక్కరకు రాని అన్నదాత సుఖీభవ పథకం

భీమడోలు: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు అన్నదాతలను నడ్డి విరిచాయి. మునుపెన్నడూ లేనివిధంగా రైతులను నష్టాలను చవిచూశారు. ఖరీఫ్‌లో వరి సాగు చేసిన పంట చేలల్లో ఇంకా ముంపు నీరు నిలిచి ఉండడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఎటూ పాలుపోక దిక్కుతోచని స్థితితో సాగుదారులంతా కొట్టుమిట్టాడుతున్నారు. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని ఉంగుటూరు, ద్వారకాతిరుమల మండలాల కంటే అత్యధికంగా భీమడోలు మండలంలో పంట నష్టంకలిగింది. ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు రైతులు పెట్టిన పెట్టుబడి వర్షార్పణమైంది. రెండు నెలల వ్యవధిలో రెండు సార్లు కురిసిన భారీ వర్షాలతో పాటు వరదలకు లోతట్టు ప్రాంతంలోని పంట చేలు పూర్తిగా మునిగిపోగా, పంట చేలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. చేలల్లోని వరి పైరు కుళ్లిపోయింది.

అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలి

ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం రూ.10వేలను మరింత పెంచి ఆదుకోవాలని వరద బాధిత రైతులు డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ పథకంలో ప్రతి రైతులకు అందించే రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందిస్తే కష్టాల నుంచి బయటపడతామని రైతులు అంటున్నారు. భీమడోలు మండలంలోని సుమారు 30వేల ఎకరాల్లో ఖరీఫ్ పంటను సాగు చేస్తున్నారు. ఏటా సార్వా సీజనల్ ప్రారంభంలో కురిసే వర్షాలకు పల్లపు ప్రాంతాల్లోని వరి నాట్లు దెబ్బతింటున్నాయి. సాగు చేసే రైతుల్లో 75 శాతం కౌలు రైతులు ఉండడంతో వారికి తీరని నష్టం వాటిల్లింది. దీనితో గత నెలలో కురిసిన వర్షాలకు భీమడోలు, గుండుగొలను, పూళ్ల రెవెన్యూ గ్రామాల్లోని శివారు ప్రాంతాల్లోని 160 ఎకరాల్లో వరి నాట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత వేలాది రూపాయలు వెచ్చించి వరినారును దూర ప్రాంతాల నుంచి తెచ్చి నాట్లు వేయగా సెప్టెంబర్‌లో వరుణుడు ప్రతాపానికి మరోసారి తీవ్రంగా రైతులు నష్టపోయారు. దీనితో ఇటీవల కురిసిన వర్షాలకు మండల వ్యాప్తంగా భీమడోలు, గుండుగొలను శివారు ప్రాంతాలు, ఎంఎంపురం, సాయన్నపాలెం గ్రామాల్లోని 57 మందికి చెందిన 96 ఎకరాల్లో చిరు పొట్ట దశలో ఉన్న వరి పంట నీటి పాలైంది. రెండు నెలలుగా వరుణుడు రైతులపై పగపట్టినట్టు వర్షాలు కురవడంతో 250 మంది రైతులకు చెందిన 220 ఎకరాల్లోని పంట దెబ్బతింది. దీంతో కోలుకోలేని విధంగా రైతులు దెబ్బతిన్నారు. దీనితో వారంతా ఖరీఫ్ సీజన్‌ను కోల్పోయారు. సార్వాలో పంట దిగుబడులు అంతంత మాత్రంగా ఉంటాయని, దీనికి తోడు వాతావరణం పగపట్టడంతో అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు. అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడి, ఆరుగాలం శ్రమ ఆవిరైపోయిందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.


కోరుకల్లు ఏరియాలో మునిగిన చేను


భీమడోలులో ముంపుబారిన పడిన చేలను పరిశీలిస్తున్న ఏడీ ఉషారాజకుమారి తదితరులు

సార్వా పంట కోల్పోయాను

భీమడోలు రైల్వేట్రాక్‌కు అనుకునిఉన్న ఐదున్నర ఎకరాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. ఏటా సార్వాలో వచ్చే వర్షాలకు వరి నాట్లు మునిగేవి. ఆ తర్వాత వర్షాలు తగ్గుముఖం పట్టగా కొంత విస్తీర్ణంలోనైనా పంట పండేది. ఈ సీజన్‌లో రెండుసార్లు కురిసిన భారీ వర్షాలకు పంట చేలు పూర్తిగా మునిగాయి. సార్వా పంటను కోల్పోయాను. ఇప్పటి వరకు రూ.75వేల వరకు పెట్టుబడి పెట్టాను. అధికారులు పంట నష్టం అంచనా కోసం సర్వే చేశారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

– తుమ్మగుంట రామకృష్ణ, కౌలు రైతు, భీమడోలు

నష్టం అంచనాకు సర్వే



పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేందుకు కృషి చేస్తాం. గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు సర్వే చేసి పంట నష్టాన్ని అంచనా వేశారు. ఆ నివేదికలను ఉన్నతాధికారులకు అందించాం. ప్రభుత్వం నిబంధనల మేరకు వారికి పరిహారం అందిస్తుంది. రైతులు ఆందోళన చెందనవసరం లేదు.

– ఎస్‌పీవీ ఉషారాణి, ఏవో, భీమడోలు

కఠిన చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): నరసాపురంలో దివ్యాంగురాలైన యువతిపైన దాడి చేసిన దుండగులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని వికలాంగ హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. 2016 దివ్యాంగుల చట్టం సెక్షన్ 92 ఏ ప్రకారం దివ్యాంగురాలిపై దాడి చేసిన వాని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరింది. బాధిత దివ్యాంగురాలికి న్యాయం చేయాలని వికలాంగ హక్కుల జాతీయ వేదిక గౌరవాధ్యక్షుడు బి.సోమయ్య, జిల్లా అధ్యక్షుడె కుందేటి జయరాజు వారు డిమాండ్ చేశారు.